## క్లుప్తంగా...

### కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ

పద్మారావునగర్: సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు డి. నాగేందర్ రాజ్ అధ్వర్యంలో శుక్రవారం పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌కు తరలి వెళ్లారు. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ వివిధ ప్రాంతాల గుండా గాంధీభవన్‌కు చేరుకుంది. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్ యాదవ్‌ను డి. నాగేందర్ ఘనంగా సత్కరించారు.

### కేన్సర్ బాధితురాలికి వెల్లాల రామ్మోహన్ ఆర్థికసాయం



సనత్‌నగర్: కేన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ మహిళకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, టీటీడీ ఎల్ఏసీ మెంబర్ వెల్లాల రామ్మోహన్ ఆపన్న హస్తం అందించారు. బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్ఎస్ఎస్) సభ్యురాలు సవితా బాలాకు ఇటీవల బ్రెస్ట్ కేన్సర్ సర్జరీ జరిగింది. చికిత్స కొనసాగుతున్న ఆమెకు ఆర్థికంగా చేయూతనందించేందుకు ముందుకువచ్చిన వెల్లాల రామ్మోహన్ రూ.10 వేలను అందజేశారు. ఆమె ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆయన భగవంతున్ని ప్రార్థించారు.

### చేనేత వస్త్రాలకు పెరుగుతున్న ఆదరణ



ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి ప్రియాంక చౌదరి

రాంగోపాల్‌పేట్: భారతీయ సంస్కృతిలో సిల్క్, చేనేత ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని నేడు వాటికి ఆదరణ పెరుగుతోందని వర్ధమాన టాలీవుడ్ నటి ప్రియాంక చౌదరి అన్నారు. శుక్రవారం పీజీరోడ్‌లోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం హాలులో కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. చేనేత వస్త్రాలపై నేటి తరం యువత కూడా ఎంతో ఆదరిస్తున్నారన్నారు.

### మెప్మా ఆధ్వర్యంలో దశాబ్ది సంబురాలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో బోర్డు కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మెప్మా కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అవగాహన ర్యాలీ

చిలకలగూడ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు నాలుగూరి పార్కు వద్ద శుక్రవారం పారిశుద్ధ్య పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాలతోపాటు ప్రజలు వినియోగించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాల నుంచి విముక్తి పొందవచ్చన్నారు.

### గాంధీభవన్ తరలిన లష్కర్ కాంగ్రెస్ శ్రేణులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం గాంధీ భవన్ కు తరలివెళ్లారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోముల ప్రకాశ్‌రావు నేతృత్వంలో ర్యాలీగా తరలివెళ్లి సికింద్రాబాద్ క్లస్టర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు అనిల్‌కుమార్‌యాదవ్‌కు అభినందనలు తెలిపారు

### అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

అడ్డగుట్ట: దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో శుక్రవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమం, రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలన్నారు. పలువురు కార్యక్రమలు పాల్గొన్నారు.

### విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఏడాదిలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణమన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల పై సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి స్పందించక పోవడం బాధకరమన్నారు.

# పరేషాన్ లేదిక..

ఇన్ని రోజులు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే వాళ్లు.. ఇక నుంచి ఈ సమస్య ఉండదు.. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారమవుతాయి.. అందుకే ఈ వార్డు కార్యాలయాల ఏర్పాటు అని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. శుక్రవారం పలుచోట్ల వార్డు కార్యాలయాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక సమస్యల పరిష్కారం కోసం వార్డు కార్యాలయాలు
- పలుచోట్ల ప్రారంభించిన కార్పొరేటర్లు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు, నాయకులు

### ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: వార్డు కార్యాలయాల ఏర్పాటు ద్వారా ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభించే ఆస్కారం ఉంటుందని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. శుక్రవారం బౌద్ధనగర్ కమ్యూనిటీహాలులో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో..



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా మంత్రి కేటీఆర్ తీసుకున్న నిర్ణయమే వార్డు కార్యాలయాల ఏర్పాటు అని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తుకారాంగేట్‌లోని ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో జీహెచ్‌ఎంసీ డీసీ దశరథ్‌తో కలిసి వార్డు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ వార్డు కార్యాలయాల్లో అన్ని శాఖల అధికారులు ఒకేచోట అందుబాటులో ఉండడం వల్ల పనులు సులువుగా అవుతాయన్నారు. నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

### బన్సీలాల్‌పేట్‌లో...



వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్: క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బోయిగూడ కేస్ బ్లాక్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన బన్సీలాల్‌పేట్ వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ కె. హేమలత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ ముకుందరెడ్డి, ఏఈ నవీన్‌లతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కార్పొరేటర్ కె. హేమలత మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు వార్డు కార్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిప్యూటీ కమీషనర్ ముకుంద రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రజల కోసం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్, సుధాకర్, అమృత, నాగలక్ష్మీ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

### వార్డు కార్యాలయాలతో ఎంతో మేలు

సనత్‌నగర్: వార్డు కార్యాలయాల ద్వారా ప్రజా సమస్యలు మరింత వేగవంతంగా పరిష్కారమయ్యే అవకాశం ఉందని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌కు సంబంధించి నెహ్రూ పార్కులో ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ముంగిటకే అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. వార్డు కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వర పరిష్కారం జరిగేలా చూడనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ కైలాసచంద్ శ్రీవాస్తవ్, ఏఈ సాయిసందీప్ పాల్గొన్నారు.

### బేగంపేటలో..



పాటిగడ్డ మోడల్ మార్కెట్‌లో వార్డు కార్యాలయాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి..

బేగంపేట పాటిగడ్డలోని మోడల్ మార్కెట్ భవనంలో ఏర్పాటుచేసిన వార్డు కార్యాలయాన్ని కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి ప్రారంభించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాలు ఎంతోగానో మేలు చేస్తాయన్నారు.

## వార్డు కార్యాలయాల్లో అన్ని రకాల సేవలు

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



బీకేగూడలో వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, సీఎస్ శాంతకుమారి

అమీర్‌పేట: నూతనంగా ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ జారీ చేసే ఎలాంటి సర్టిఫికెట్ కావాల్సి ఉన్నా ఇక్కడే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీకేగూడలో ఏర్పాటు చేసిన అమీర్‌పేట డివిజన్ వార్డు కార్యాలయాన్ని శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ప్రారంభించారు. ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు చేయాలంటే ఎక్కడికో తిరగాల్సిన పని ఉండదన్నారు.

### నగరంలో ఎంతో అభివృద్ధి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా గత 9 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్ ఏమేమి పనులు చేయాలన్నదానిపై ప్రణాళికలు తయారు చేస్తున్నారని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు, బ్రిడ్జిల నిర్మాణం, గ్రీనరీవల్ల నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వివరించారు. నగరాన్ని గొప్పగా తీర్చి దిద్దినందుకు గాను సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెపుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ, మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి పాల్గొన్నారు.

### పుస్తకాలను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి

లాలాపేట: నేటి యువత అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ లా కాలేజీలో ఎల్ఎల్‌బి చదువుతున్న విద్యార్థి కార్తీక సాయి జీవితం ఒక ప్రయాణం, పవర్ ఆఫ్ ప్రియార్టీ అనే రెండు పుస్తకాలను రచించారు. శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఆయన చేతుల మీదుగా తన పుస్తకాలను ఆవిష్కరింపజేయించారు.



## బోలక్‌పూర్‌లో పర్యటించిన కేంద్ర మాజీ మంత్రి



బోలక్‌పూర్‌లో ముద్రలోన్ లబ్ధిదారులతో మాట్లాడిన మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లో శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్ పర్యటించారు. మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శ్యాంసుందర్ గౌడ్, టి. రాజశేఖరరెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, సురేష్, సీకే శంకర్, వై. శ్రీనివాస్ తదితరులతో కలిసి బోలక్‌పూర్ ప్రాంతంలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ముద్ర లోన్ లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుర్మ శంకర్, డి. లక్ష్మీ, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

రసూల్‌పురా: బడీడు పిల్లలను పనుల్లోకి పంపకుండా చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కార్ఖాన పీఎస్ ఎస్ఐ నరేష్ కోరారు. మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆశీర్వాదం, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మడ్‌ఫోర్ట్‌హట్స్ గాంధీనగర్, శ్రీరాంనగర్. డబుల్‌బెడ్‌రూం గృహ సముదాయం ప్రాంతాల్లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలని ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రభుత్వం అనేక మౌళిక వసతులు కల్పిస్తోందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, అప్సా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఐ నరేష్ తదితరులు

## సీఎంఆర్‌ఎఫ్‌తో చేయూత : డిప్యూటీ మేయర్

లాలాపేట: అనారోగ్యం బారిన పడి మెరుగైన వైద్యం చేయించుకోలేని వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో చేయూతనందిస్తుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. ఇంత కాలం విదేశీ పర్యటన(అమెరికా)కు వెళ్లిన డిప్యూటీ మేయర్ శుక్రవారం తిరిగి నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తార్నాకకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్, పత్రాలను తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆమె వారికి అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, ఖాజా తదితరులున్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

### భూకబ్జాదారులతో ఓయూ వీసీ కుమ్మక్కు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూముల కబ్జాదారులతో వీసీ కుమ్మక్కయ్యారని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ( బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ ధ్వజమెత్తారు. శుక్రవారం హబ్సిగూడ్ వైపు కబ్జాకు గురైన స్థలాన్ని సందర్శించి ఆక్రమణదారులతో వాగ్వివాదానికి దిగారు. వీసీ ప్రోత్సాహంతో బీఆర్ఎస్ నాయకుల అండతో ఓయూ భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు.

### గృహిణి అదృశ్యం

చిలకలగూడ : కుటుంబ కలహాల నేపథ్యంలో గృహిణి అదృశ్యమైంది. చిలకలగూడ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. పద్మారావునగర్ స్కందగిరి ఆలయ ప్రాంతానికి చెందిన సాల్మన్‌రాజ్ భార్య కృష్ణతులసీ (27) ..తాను ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు ఉత్తరం రాసి, మంగళసూత్రం, ఇతర వస్తువులు ఇంట్లోనే వదిలేసి వెళ్లిపోయింది. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో భర్త సాల్మన్‌రాజ్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: నిత్యం వినియోగదారులతో రద్దీగా ఉండే ఎస్డీరోడ్డులోని తాజ్‌మహల్ హోటల్లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు.. గురువారం రాత్రి 11గంటల సమయంలో తాజ్‌మహల్ హోటల్‌లోని కిచన్‌లో ఉండే ఎగ్జాస్ట్ ప్యాన్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన వినియోగదారులు హోటల్ నుంచి పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకుని వచ్చారు.

### నేలకొరిగిన భారీ వృక్షం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్డీరోడ్డులోని సెయింట్ మేరీస్ చర్చిప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఓ భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఒక వైపు రోడ్డు మొత్తం మూసుకుని పోయింది. దీంతో కొద్ది నిమిషాల్లోనే ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్ క్రేన్‌ను రప్పించి సిబ్బందితో కలిసి చెట్టు కొమ్మలను అక్కడి నుంచి తొలగించారు.

### జీహెచ్‌ఎంసీ కార్మికుల సేవలు అభినందనీయం



లాలాపేట: జీహెచ్‌ఎంసీ కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని, అందుకే సీఎం కేసీఆర్ వారి సేవలను గుర్తిస్తూ ఇటీవల రూ 1000 వేతనాన్ని పెంచారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సీహెచ్ సునీల్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను శుక్రవారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియం వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు సలాం చేశారు. శానిటరీ సూపర్ వైజర్ ధనాగౌడ్ పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు

సనత్‌నగర్: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా పోలీసు సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి మొదటిసారి పట్టుబడ్డ ఇద్దరు, రెండోసారి పట్టుబడ్డ మగ్గురిని కోర్టులో హాజరుపర్చగా వారికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. దీంతో మరో నలుగురికి జరిమానా విధించారు. అలాగే ఇద్దరికి నాలుగు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేశారు.

### ఏబీవీపీ నాయకుల పై ఓయూ భూ కబ్జాదారుల దాడి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ హబ్సిగూడ వైపు అక్రమంగా భవన నిర్మాణాన్ని అడ్డుకున్న ఏబీవీపీ నాయకులపై గురువారం రాత్రి భూ కబ్జాదారులు దాడి చేశారు. శుక్రవారం ఓయూ భూముల కబ్జాలకు, విద్యార్థుల పై దాడికి నిరసనగా పాలన భవనం ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఏబీవీపీ నాయకుడు జీవన్ మాట్లాడుతూ అక్రమ కట్టడాలను అడ్డుకున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు వికాస్‌తో పాటు మరికొందరి పై దాడి చేయడం దారుణమన్నారు.

### భారత రాజ్యాంగ అధికరణ 17ను సవరించాలి

లాలాపేట: భారత రాజ్యాంగ అధికరణ 17ను సవరించి అంటరానితనం నిర్మూలనకు బదులు కుల నిర్మూలన చేపట్టాలని తెలంగాణ ప్రధాన న్యాయమూర్తికి గతంలో రాసిన లేఖను ప్రజా ప్రయోజనార్థం స్వీకరించాలని ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ కోరారు. శుక్రవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అసమానతలకు మూల కారణం కుల వ్యవస్థ అన్నారు. గత సంవత్సరం జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ ఉన్నత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్లు గుర్తు చేశారు.

### బండరాళ్లను తొలగించండి



పద్మారావునగర్: జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణాలోపం...కాంట్రాక్టర్ నిర్లక్ష్యం...బాధ్యతారాహిత్యం పాఠశాల విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. నిత్యం రద్దీగా ఉంటే రోడ్డుపై భారీ బండరాళ్లను తొలగించకపోవడంతో ఓ వైపు ట్రాఫిక్ సమస్య మరో వైపు విద్యార్థులు రాకపోకలు సాగించడం కష్టమవుతున్నది. బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడ సెయింట్ ఫీలోమినా పాఠశాల ముందు నూతన వీడీసీసీ రోడ్డు వేశారు. రోడ్డు పనులు పూర్తై నెలలు గడుస్తున్నా పురాతన పుట్‌పాత్ బండరాళ్లను రహదారి పొడవునా రోడ్డు పై వేసి కాంట్రాక్టర్ తన పనులను పూర్తి చేసుకున్నాడు. సకాలంలో వీటిని తొలగించకపోవడం వల్ల నిత్యం ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీకావు. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహనచోదకులు ట్రాఫిక్ రద్దీతో తీవ్ర అసౌకర్యానికి గురికావడమే కాకుండా విద్యార్థులు పాఠశాల లోనికి వెళ్లడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి బండరాళ్లను రోడ్డుపై నుంచి తొలగించాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

### కంటోన్మెంట్‌కు చేసిందేమీ లేదు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఆరోవార్డు తాడ్‌బండ్‌లో రూ.17.62 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ నేతలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.